క్లుప్తంగా

పాలిథిన్ కవర్లు సీజ్



పాలిథిన్ సంచులతో కూరగాయలు స్వాధీనం చేసుకుంటున్న శానిటరీ సూపర్‌వైజర్లు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్‌లో శానిటేషన్ సూపర్‌వైజర్లు దుకాణాలలో తనిఖీలు చేపట్టి పాలిథిన్ సంచులను సీజ్ చేశారు. కూరగాయలు, హొటళ్లు, కిరాణా దుకాణాలలో పట్టుబడిన పాలిథిన్ సంచులను స్వాధీనం చేసుకుని, వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు నెలలుగా పాలిథిన్ నిషేధంపై అవగాహన కలిగిస్తున్నా వ్యాపారులు, వినియోగదారులు పూర్తిగా సహకరించడం లేదన్నారు. మళ్లీ మళ్లీ పట్టుబడిన వ్యాపారులకు భారీగా జరిమానాలు విధిస్తామని ఇన్‌స్పెక్టర్ బి.మహలక్ష్మినాయుడు హెచ్చరించారు.

పుస్తక పఠనంతో ఉన్నత శిఖరాలు



పుస్తక ప్రదర్శన తిలకిస్తున్న రిజిస్ట్రార్ గుణశేఖరన్

కొమ్మాది: సాంకేతికంగా ఎంత అభివృద్ధి సాధిస్తున్నా పుస్తక పఠనానికి ఉన్న ప్రాధాన్యం చిరకాలం ఉంటుందని గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్ అన్నారు. గీతం నాలెడ్జ్ రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో ఏర్పాటైన పుస్తక ప్రదర్శనను బుధవారం ఆయన ప్రారంభించారు. విద్యార్థి దశలోనే పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవడం వారిని ఉన్నత శిఖరాలకు తీసుకుని వెళ్తుందన్నారు. విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంచడానికి పుస్తక ప్రదర్శన తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో గీతం గ్రంథాలయ డైరెక్టర్ డా. ఎస్.పి.ఎ.బాలసుబ్రహ్మణ్యన్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసర వస్తువుల పంపిణీ



వాంబేకాలనీలో పేదలకు సరకులు, దుస్తులు పంపిణీ చేస్తున్న శ్రీనివాసరావు, నాయకులు

మధురవాడ: పేదలకు వైఎస్సార్‌సీపీ నిత్యం అండగా ఉంటుందని ఏపీ నగరాలు కార్పొరేషన్ మాజీ చైర్మన్ పోతిన శ్రీనివాసరావు అన్నారు. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని బుధవారం సాయంత్రం జీవీఎంసీ 7వ వార్డులోని వివిధ విభాగాలు నాయకులు వి.రామిరెడ్డి, కాంతారావు, నూకరాజు, రమణమ్మ, దుర్గ, ఆనంద్ తదితరులు సమకూర్చిన వస్తువులను ఆయన వాంబేకాలనీ కాలనీలో పేదలకు పంపిణీ చేశారు.

స్థలం ఆక్రమణ యత్నంపై వృద్ధురాలి ఫిర్యాదు

భీమునిపట్నం: తమ స్థలాన్ని కొందరు దౌర్జన్యంగా ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని ఆర్‌డీవో కార్యాలయంలో పరిపాలన అధికారి మనోరంజనికి ఆనందపురానికి చెందిన సుంకర అప్పలరాములమ్మ బుధవారం ఫిర్యాదు చేశారు. అనేక సంవత్సరాలుగా ఇక్కడ 0.74 సెంట్ల స్థలంలో కుటుంబంతో ఉంటున్నామని, కానీ కొందరు ఆ స్థలం తమదని వచ్చి దౌర్జన్యానికి పాల్పడుతున్నారని వాపోయారు. దీనిపై అనేక సార్లు ఫిర్యాదులు చేశామని తెలిపారు. దీనిపై చర్యలు తీసుకుని, రక్షణ కల్పించాలని కోరారు.

సంప్రదాయ తోరణం.. సాంస్కృతిక వైభవం

- కోలాటానికి పెరుగుతున్న ఆదరణ
- ఆసక్తి కనబరుస్తున్న మహిళలు, పిల్లలు
- అటు ఆధ్యాత్మిక చింతన.. ఇటు ఉపాధి మార్గం
- బృందాలుగా ప్రదర్శనలు

వేదిక ఏదైనా.. వేడుక ఎక్కడైనా నేడు అంతటా కోలాటాల కోలాహలమే. సంప్రదాయ ఒరవడిని కొనసాగిస్తూ.. సాంస్కృతిక వైభవాన్ని చాటుతూ ఆదరణ పొందుతోంది. పాటకు అనుగుణంగా పదం కలుపుతూ.. లయబద్ధంగా సాగే ఈ నృత్యం సందర్శకులను ఆకట్టుకుంటోంది. ఆధ్యాత్మిక వేడుకలో భక్తులను పరవశింపజేస్తోంది.. పండగ వేళ హుషారు పెంచుతోంది. పాశ్చాత్య సంస్కృతి విశ్వవ్యాప్తమవుతున్న వేళ ప్రాచీనకళ పూర్వ వైభవాన్ని సంతరించుకోవడం కళారాధకులకు ఉత్సాహాన్నిస్తోంది. ఆరోగ్యానికి కూడా ఎంతో దోహదం చేస్తున్న ఈ నృత్యాన్ని నేర్చుకునేందుకు చిన్నారులు కూడా ఆసక్తి చూపడంతో బృందాలెన్నో ప్రదర్శనలకు సిద్ధమవుతున్నాయి.

కొమ్మాది: కోలాటం పూర్వ వైభవాన్ని సంతరించుకుంది. మన సంస్కృతిని భావితరాలకు తెలియజేయాలనే లక్ష్యంతో కళాకారులు, కళాభిమానులు చేస్తున్న ప్రయత్నం సత్ఫలితాలనిస్తోంది. పాశ్చాత్య పోకడల నుంచి మన యువతను అసలు సిసలైన తెలుగు జానపదాలవైపు నడిపించాలనే ఆలోచనతో తమకు వచ్చిన కళను పది మందికి పంచుతున్నారు. ఆధ్యాత్మిక సేవలో తరించడంతో పాటు ఉపాధి పొందుతున్నారు. కోలాటాన్ని ప్రస్తుతం వయసుతో సంబంధం లేకుండా చిన్నవారి నుండి పెద్ద వారి వరకు నేర్చుకుంటున్నారు. దీంతో ఏ చిన్న ఆధ్యాత్మిక కార్యక్రమం తలపెట్టినా కోలాట బృందాలు సందడి చేస్తున్నాయి. మహిళలు బృందాలుగా ఏర్పడి చిడతలు కొడుతూ, పాటకు అనుగుణంగా పదం కలుపుతూ ముందుకు సాగుతున్నారు. కోలాటం గొప్పదనాన్ని చాటి చెపుతున్నారు. భావి తరాలకు ఆ కళా వైభవం వివరిస్తున్నారు. నియోజకవర్గ పరిధిలో సుమారు 30 నుంచి 35 బృందాలు ప్రదర్శనలిస్తూ.. ప్రశంసలందుకుంటున్నాయి. ఉపాధిమార్గంగా ఎంచుకుంటున్నాయి.



కోలాటం ప్రదర్శిస్తున్న బృందం



కోలాటం నిర్వహిస్తున్న శ్రీ లక్ష్మీ నరసింహ కోలాట బృందం

వేడుకల్లో, ఆలయాల్లో ప్రదర్శనలు

మన తెలుగు వారి పండగలు సంక్రాంతి, ఉగాది మొదలుకుని.. వేడుక ఎక్కడైనా..వేదిక ఏదైనా.. కోలాటమే ప్రధాన ఆకర్షణ. సింహాచలం, కనకమహాలక్ష్మి ఆలయం, రుషికొండలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానం మొదలుకుని చిన్న దేవాలయాల్లో జరిగే ప్రతి వేడుకలోనూ ఈ కోలాటం తప్పక ఉంటోంది.



కోలాటం నిర్వహిస్తున్న దాససాహిత్య ప్రాజెక్టు, శ్రీమన్నారాయణ భజన కోలాట మండలి బృందం

చూసి తీరాల్సిందే..

ప్రస్తుతం యువత సోషల్ మీడియాలో రీల్స్, వ్లాగ్స్, పోస్టులతో కాలక్షేపం చేయడమే కనపడుతుంది. ఇలాంటి తరుణంలో మానసిక, శారీరక దృఢత్వానికి సహకరించే కోలాటాన్ని నేర్చుకోవడం ఎంతో ఉపయోగకరం. అందుకే దీనిని గ్రహించిన యువతులు ఈ కోలాటంపై ఆసక్తి కనపరుస్తున్నారు. కోలాటానికి ఇప్పుడు అన్ని ప్రాంతాల్లో విశేష ఆదరణ లభిస్తోంది. ఒక్కో ప్రాంతాల్లో ఒక్కో ఆలయం వద్ద కొంత మంది మహిళలు బృందాలుగా ఏర్పడి సాయంత్రం సమయాల్లో కోలాటం నేర్చుకుంటున్నారు. సంప్రదాయ రీతిలో ఒకే వస్త్రధారణతో లయబద్ధంగా చేసే ఈ నృత్యాన్ని చూసి తీరాల్సిందే.

కళలపై ఆసక్తి పెంచేందుకే..



మన కళలు, సంస్కృతిని పరిరక్షించాలంటే నేటి తరం వీటిని ఆదరించాలి. అందుకే మా ఈ చిన్న ప్రయత్నం. ఆలయాల్లో, పండగల్లో ప్రదర్శనలిస్తూ విస్తృతంగా ప్రచారం చేస్తున్నాం. భక్తి భావాన్ని పెంపొందించడంతో పాటు చక్కని వ్యాయామంగా కూడా ఈ కోలాటం ఉపయోగపడుతుంది. కోలాటానికి ఆదరణ పెరగడం మాకు ఎంతో ఆనందాన్నిస్తోంది.

– బి.సాయి రోజా కుమారి, దాససాహిత్య ప్రాజెక్టు, శ్రీమన్నారాయణ భజన కోలాట మండలి

ఔత్సాహికులకు శిక్షణ



మా మధురవాడ ప్రాంతాల్లో కోలాటంపై పిల్లలకు, పెద్దలకు అవగాహన కల్పిస్తూ, శిక్షణ సౌకర్యం కల్పిస్తున్నాం. పలు ఆలయాల్లో ఈ కోలాట ప్రదర్శనలు ఇస్తూ నేర్చుకున్న కళకు న్యాయం చేస్తున్నాం. మా బృందంతో పాటు కొత్తగా వచ్చినవారికి, ఆసక్తి ఉన్నవారికి శిక్షణ ఇస్తున్నాం. చిన్నారులకు కూడా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం.

– సంతోషి, శ్రీ లక్ష్మీ నరసింహ కోలాట బృందం

రొయ్యల హేచరీల్లో ఆకస్మిక తనిఖీలు



మంగమారిపేటలోని కేంద్రాల్లో తనిఖీ నిర్వహిస్తున్న మత్స్యశాఖ జేడీ లక్ష్మణరావు

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు మంగమారిపేట నుంచి తిమ్మాపురం వరకు ఉన్న రొయ్యిపిల్లల ఉత్పత్తి కేంద్రాలను(హ్యాచరీస్) మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హ్యాచరీస్‌లో వసతులు, రొయ్యిపిల్లల ఉత్పత్తి ప్రక్రియలో వాడుతున్న ప్రో బయోటిక్స్, ట్రీట్‌మెంట్ ప్లాంట్స్, బ్రూడ్ స్టాక్‌లను పరిశీలించారు. తదుపరి పరీక్షల నిమిత్తం ఎంపెడా (ఎంపీఈడీఏ) నమూనాలను సేకరించింది. ఆక్వా కల్చర్, ఆక్వా సంబంధిత యూనిట్లలో నిషేధిత యాంటీ బయోటిక్స్ వాడకాన్ని ప్రభుత్వం నిషేధించిన దృష్ట్యా టాస్క్‌ఫోర్స్ కమిటీ ఈ యూనిట్లను పరిశీలించింది. ఈ తనిఖీల్లో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అభిప్రియ, ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

బాలికల సంరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న పీడీ జయదేవి

భీమునిపట్నం: బాలికల సంరక్షణ అందరి బాధ్యత అని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ జయదేవి అన్నారు. ఆడపిల్లలను మంచిగా ఎదగడానికి ప్రోత్సాహం అందించాలని సూచించారు. భీమిలిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, సచివాలయ మహిళా పోలీసులు, వెల్ఫేర్ అసిస్టెంట్లకు కిశోరి వికాసంపై శిక్షణ ఇచ్చారు. బాలికల చదువు, ఆరోగ్యంతో పాటు ఇతర విషయాల్లోనూ జాగ్రత్తలు పాటించాలన్నారు. ముఖ్యంగా ప్రతి ఆడపిల్లా బాగా చదువుకోవాలన్నారు. బాల్యవివాహాల జోలికి పోకుండా గ్రామాల్లో అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో శిశు సంక్షేమశాఖ ప్రాజెక్ట్ అధికారి శ్రీదేవి, జోనల్ కమిషనర్ ప్రేమప్రసన్న వాణి, ఎంఈవో శివరాణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చిన్న శ్రీనుకు శుభాకాంక్షల వెల్లువ



చిన్న శ్రీనుతో వైఎస్సార్‌సీపీ 5, 6, 7 వార్డుల్లోని వివిధ విభాగాల ముఖ్య నాయకులు

వైఎస్సార్‌సీపీ భీమిలి నియోజకవర్గ సమన్వయ కర్తగా నియమితులైన మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను)ను వివిధ ప్రాంతాల నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జీవీఎంసీ 5, 6, 7,8 వార్డుల నాయకులు విజయనగరంలోని ఆయన నివాసం వద్ద కలిసి, శుభాకాంక్షలు తెలిపారు. ఏడో వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి ఆయనకు తినిపించారు. పార్టీ వార్డు అధ్యక్షులు పోతిన హనుమంతరావు, గుడ్ల పోలిరెడ్డి తదితరులు ఆయనకు అభినందనలు తెలిపారు. – మధురవాడ/కొమ్మాది



మజ్జి శ్రీనివాసరావును సత్కరిస్తున్న పోలిరెడ్డి, 8వ వార్డు ముఖ్య నాయకులు



పోతిన శ్రీనివాసరావుకు కేక్ తినిపిస్తున్న చిన్న శ్రీను, చిత్రంలో భీమిలి ఎంపీపీ వాసురాజు

26 నుంచి తాజుద్దీన్ బాబా జయంతి వేడుకలు



నీలయమ్మ సత్రంలోని తాజుద్దీన్‌బాబా ఆశ్రమం

తగరపువలస: భీమిలి మండలం దాకమర్రి పంచాయతీ నీలయమ్మసత్రం కూడలిలోని హజరత్ తాజుద్దీన్‌బాబా ఆశ్రమంలో ఈ నెల 26 నుంచి మూడు రోజుల పాటు బాబా 164వ జయంతి వేడుకలు నిర్వహించనున్నారు. ఆశ్రమ వ్యవస్థాపకుడు తాజి రెడ్డిబాబా పతాకావిష్కరణతో ఆదివారం వేడుకలు ప్రారంభం కానున్నాయి. 27, 28 తేదీలలో అన్నదానంతో ఈ వేడుకలు ముగుస్తాయి. ఈ వేడుక లలో రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఉత్తరాది రాష్ట్రాల నుంచి 75 వేల మంది భక్తులు పాల్గొనవచ్చని అంచనా. వీరిలో కులమతాలకు అతీతంగా ఎక్కువగా హిందువులే పాల్గొనడం విశేషం. భక్తులతో పాటు రాజకీయ నాయకులు బాబా ఆశ్రమానికి చేరుకుని దర్బారులో దువాతో పాటు చాదర్, గులాబీలు, అత్తరు సమర్పిస్తారు. ధునిలో అగరబత్తీ వేసి ఆశీస్సులు తీసుకుంటారు. ఆశ్రమంలో నిర్వహించే ఖవ్వాలీలో పాల్గొంటారు. ఈ నెల 27న జరిగే బాబా జయంతి వేడుకలకు విజయనగరానికి చెందిన రొబ్బి హేమకుమార్, నాగ్‌పూర్‌కు చెందిన మహమ్మద్ షార్ఫుద్దీన్, చత్తీస్ గడ్‌లోని డొంగర్‌గడ్‌కు చెందిన ఖాదర్ వలీబాబా ఆశ్రమ నిర్వాహకులు ప్రత్యేకంగా చాదర్, చందల్ సమర్పించనున్నారు.



తాజుద్దీన్ బాబా దర్బారు

2003లో ఆశ్రమ నిర్మాణం

అరేబియాకు చెందిన బాబా కుటుంబ సభ్యులు మద్రాస్ వచ్చి స్థిరపడినట్టు తెలుస్తుంది. అప్పట్లో సైన్యంలో పనిచేసిన బాబా, షిర్డీ సాయిబాబా వలే అనేక మహిమలు చూపించి తన చుట్టూ ఉన్నవారి బాధలు తీర్చినట్టు చెబుతారు. 1925లో బాబా మరణం తరువాత ఆయన భౌతిక కాయాన్ని మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో ఖననం చేశారు. ప్రస్తుతం ఆ ప్రాంతం ప్రముఖ పుణ్యక్షేత్రంగా వెలుగొందుతోంది. బాబా సూచనలతోనే తాజిరెడ్డి బాబా 2003లో దాకమర్రి వద్ద ఆశ్రమాన్ని నిర్మించారు. ఏటా బాబా జయంతి వేడుకలకు నాగ్‌పూర్ వెళ్లలేనివారు దాకమర్రి ఆశ్రమంలోని వేడుకలలో పాల్గొంటారు. ఇక్కడ జరిగే మూడురోజుల వేడుకలను ట్రస్టీలు మహమ్మద్ అస్లాం, డి.రాజు కుమందన్, మహమ్మద్ సోహెబ్, వి.త్రిమూర్తి పర్యవేక్షించనున్నారు.

80 మందికి క్యాంపస్ కొలువులు

కొమ్మాది: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో జరుగుతున్న ప్రాంగణ నియామకాల్లో గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ విద్యార్థులు 80 మంది పలు కార్పొరేట్ సంస్థల్లో భారీ వేతనాలతో ఉద్యోగాలు సాధించినట్లు గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ డైరెక్టర్ వంశీకిరణ్ సోమయాజులు తెలిపారు. వీరిలో పలువురు విద్యార్థులు రూ.11 లక్షల వార్షిక వేతనంతో ఎంపికైనట్లు తెలియజేశారు.

ఆర్థిక అక్షరాస్యతపై కళాజాత



తునివలసలో కళాజాత ప్రదర్శిస్తున్న కళాకారులు

పద్మనాభం: 'సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త.. ఆర్థిక అక్షరాస్యత'పై మండలంలోని తునివలసలో కళాజాత ద్వారా బుధవారం అవగాహన కల్పించారు. రెడ్డిపల్లి ఎస్‌బీఐ ఆధ్వర్యంలో వీధి నాటిక, జానపద గీతాలు, హాస్య వల్లరి ద్వారా పలు అంశాలు తెలియజేశారు. జీవన్ జ్యోతి, ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్, అటల్ పెన్షన్ యోజన, ప్రధాన మంత్రి ఎన్‌పీఎస్ వాత్సల్య పథకాలపై అవగాహన కల్పించారు. బ్యాంక్ వివరాలు ఎవరికీ ఇవ్వకూడదని, మోసాలకు గురైన వారు 1930 టోల్ ఫ్రీ నంబర్‌కి తెలియజేయాలని ప్రజలకు వివరించారు. రాజమహేంద్రవరం విభూతి బ్రదర్స్ కళాజాత బృందం ఈ ప్రదర్శన ఇచ్చింది. కార్యక్రమంలో ఎస్‌బీఐ మేనేజర్ విజయ శంకర్, సీఎస్‌పీ కిలారి శంకర్ పాల్గొన్నారు.

హిందీ పరీక్షల్లో కస్తూర్బా విద్యార్థినుల ప్రతిభ



సర్టిఫికెట్లు, పతకాలతో విద్యార్థినులు

పద్మనాభం: దశ మండల విద్యా సేవా సదన్ ఆన్‌లైన్‌లో నవంబర్ 11వ తేదీన నిర్వహించిన రాష్ట్రస్థాయి హిందీ పరీక్షల్లో పద్మనాభం కస్తూర్బా విద్యార్థినులు 12 మంది ప్రతిభ కనబరిచారు. ఐదుగురు బంగారు పతకాలు, ఏడుగురు వెండి పతకాలు, సర్టిఫికెట్లు సాధించారు. వీటిని విద్యా సేవా సదన్ ప్రతినిధులు పోస్ట్ ద్వారా కస్తూర్బా విద్యాలయానికి పంపించారు. ప్రిన్సిపాల్ గ్రేస్ లిల్లీ వీటిని విద్యార్థినులకు బుధవారం అందజేసి అభినందించారు.కార్యక్రమంలో హిందీ సీఆర్టీ ఎస్.కోమలి పాల్గొన్నారు.

పశువైద్య శిబిరానికి విశేష స్పందన



పశువులకు చికిత్స చేస్తున్న పశు వైద్యాధికారి మహేష్ కుమార్

పద్మనాభం: పద్మనాభం గ్రామంలో బుధవారం నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 427 పశువులకు నట్టల వ్యాధి నివారణ మందులు పట్టారు. వీటిలో 152 మేకలు, 65 లేగ దూడలు, 210 కోళ్లు ఉన్నాయి. 52 పశువులక గర్భకోశ వ్యాధులకు పద్మనాభం పశువైద్యాధికారి కె.మహేష్ కుమార్ చికిత్స చేశారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది బి.పోలారావు, రెహమెన్, వరలక్ష్మి పాల్గొన్నారు.

నట్టల నివారణ మందులు తప్పనిసరి

తగరపువలస: దూడలకు క్రమం తప్పకుండా తప్పనిసరిగా నట్టల నివారణ మందులు తాగించాలని జిల్లా పశువ్యాధి నిర్ధారణ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ పి.మోహినికుమారి తెలిపారు. ఆనందపురం మండలం గొట్టిపల్లిలో బుధవారం జరిగిన ఉచిత పశువైద్య శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా 46 పశువులకు తనిఖీ చేసి 25 లేగదూడలకు నట్టల నివారణ మందులు తాగించారు. సిబ్బంది పశువులకు పేడ, రక్త పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పశువైద్యుడు పి.అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పింఛన్లు తొలగించడం భావ్యమా?

- అర్హులైన ఒక్కరి పింఛను తొలగించినా ఆందోళన తప్పదు
- వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న మజ్జి శ్రీనివాసరావు

తగరపువలస: పింఛన్ల పునఃపరిశీలన పేరుతో కూటమి ప్రభుత్వం దివ్యాంగులను బాధించడం భావ్యం కాదని విజయనగరం జెడ్పీ చైర్మన్, భీమిలి అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) ఆవేదన వ్యక్తం చేశారు. దివ్యాంగుల్లో అర్హులైన ఏ ఒక్కరి పింఛను తొలగించినా వారి తరఫున వైఎస్సార్‌సీపీ ఆందోళన తప్పదని అధికారులను హెచ్చరించారు. గురువారం నుంచి దివ్యాంగుల పింఛన్ల పునఃపరిశీలనకు అధికారులు సిద్ధమైన నేపథ్యంలో బుధవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. ప్రస్తుతం పింఛను పొందుతున్న దివ్యాంగుల్లో ఇంటికి, మంచానికే కొన్నేళ్లుగా పరిమితమైనవారే ఎక్కువ మంది ఉన్నారని చెప్పారు. ప్రతి నెలా ప్రభుత్వం ఇచ్చే పింఛనుపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం పింఛన్ల పునఃపరిశీలన పేరుతో బాధించడం సరికాదన్నారు. ఆసుపత్రుల్లో పరిశీలనా కేంద్రాలకు వచ్చి తనిఖీలు చేయించుకోవాలని షరతు పెట్టడాన్ని ఖండించారు. ఇది వారిని వ్యయప్రయాసలకే గాక శారీరకంగా, మానసికంగా ఇబ్బందులకు గురిచేయడమేనని ఆందోళన వ్యక్తం చేశారు. బుద్ధిమాంద్యం, మానసిక సమస్యలతో బాధపడుతున్నవారిని ఆసుపత్రులకు తీసుకురావడం కుటుంబసభ్యులకు ఎంతో కష్టమవుతుందన్నారు. కేవలం సామాజిక పింఛన్ల కోత వేయడానికే కూటమి ప్రభుత్వం ఇప్పుడీ పింఛన్ల పునఃపరిశీలనకు తెరలేపిందని విమర్శించారు. అర్హులైన దివ్యాంగుల్లో ఏ ఒక్కరి పింఛను తీసేసినా ఊరుకోబోమన్నారు. వారి తరఫున తమ పార్టీ పెద్ద ఎత్తున ఆందోళన చేయడానికి సిద్ధమని హెచ్చరించారు.

చెరువుల పునరుద్ధరణ పనుల ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న ఎంపీ శ్రీ భరత్, కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఎమ్మెల్యే గంటా

కొమ్మాది: జీవనాధారమైన నీటిని సంరక్షించుకోవడంలో భాగంగా చెరువులను పునరుజ్జీవింపచేసుకోవడం స్వాగతించాల్సిన విషయమని ఎంపీ ఎం.శ్రీభరత్ అన్నారు. 4వ వార్డు కాపులుప్పాడలో వీఎంఆర్‌డీఏ, థాన్ ఫౌండేషన్ సంయుక్తంగా చేపట్టిన గొలుసుకట్టు చెరువుల పునరుద్ధరణ పనులను కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, వీఎంఆర్డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతో కలసి ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ పట్టణీకరణలో భాగంగా అనేక చెరువులు కనుమరుగైపోవడం లేదా చెత్త చెదారాలతో నిండిపోవడం జరుగుతుందన్నారు. ప్రజా భాగస్వామ్యంతోనే చెరువు గర్భాలను రక్షించుకోవడం సాధ్యపడుతుందన్నారు. కాపులుప్పాడ చెరువును ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న 16 ట్యాంకులను గొలుసుకట్టు చెరువుల విధానంలో చేర్చినట్లు తెలిపారు. ఈ చెరువులకు మరమ్మతులు చేసి వచ్చే జూన్‌కల్లా నీరు అందించే విధంగా చూడాలన్నారు.

అధికారులకు వినతి: మారికవలస లోని సీఫుడ్స్ కంపెనీలు కలుషిత నీరును నేరుగా పైపుల ద్వారా కాలువల్లోకి వదులుతున్నారని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ దృష్టికి స్థానిక నాయకుడు ఎరుసు అప్పలకొండరెడ్డి తీసుకువచ్చారు. అది నేరుగా కాపులుప్పాడ ప్రాంతానికి చేరుకుని చెరువులను కలుషితం చేస్తోందని తెలిపారు. దీనివల్ల దుర్గంధం, చర్మవ్యాధులు వస్తున్నాయని, చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రొటోకాల్ ఉల్లంఘన.. వెనుదిరిగిన కార్పొరేటర్

కాపులుప్పాడలో నిర్వహించిన చెరువుల పునరుద్ధరణ కార్యక్రమంలో ప్రొటోకాల్ పాటించకపోవడం, వార్డు కార్పొరేటర్‌ను స్టేజ్‌పైకి పిలవకపోవడాన్ని నాయకులు తీవ్రంగా వ్యతిరేకించారు. దీంతో కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు కార్యక్రమం నుంచి వెనుదిరిగారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమాలను ఇక్కడ నాయకులు పార్టీపరంగా చూస్తున్నారని, ఇది సరైన పద్ధతి కాదని అన్నారు.